క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం పొందిన ఉపాధ్యాయులతో ఎంఈఓ

కొలిమిగుండ్ల: పెట్నికోట ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఏడుగురు ఉపాధ్యాయులు సుధాకర్‌గుప్త, చంద్రశేఖర్, రమణయ్య, బాల మద్దిలేటి, సుందరరాజు, బాల రాఘవేంద్రప్రసాద్, రమేష్‌లను పాఠశాల హెచ్‌ఎం ధరణి ఆధ్వర్యంలో సన్మానించారు. సన్మాన సభలో ఎంఈఓ అబ్దుల్ కలాం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. సమాజంలో గురువుకు గౌరవ స్థానం ఉందన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు విద్యాభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న సంఘం అధ్యక్షుడు

బనగానపల్లె: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి అన్నారు. మండలంలోని దేవనగర్ ఎంపీపీ పాఠశాలలో మంగళవారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగించారు. 14 ఏళ్లలోపు పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలకు విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. విద్యతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం హుస్సేన్‌వలి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కేరళ పోలీస్ వాహనానికి జరిమానా

డోన్ టౌన్: రిజర్వు బ్యాంక్ పని నిమిత్తం పోలీసులతో నాగ్‌పూర్ నుంచి కేరళ వెళుతున్న ఇన్నోవా వాహనానికి ఆంధ్రా ట్యాక్స్ చెల్లించకపోవడంతో రూ.14వేల జరిమానా విధించి సీజ్ చేసినట్లు డోన్ ఎంవీఐ క్రాంతికుమార్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం డోన్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేశామన్నారు. ఇన్నోవా వాహన రికార్డులు పరిశీలించగా ట్యాక్స్ చెల్లించకుండా ఏపీలోకి ప్రవేశించినట్లు గుర్తించి జరిమానా విధించామన్నారు.

నేడు అమావాస్య పూజలు

డోన్: అమావాస్యను పురస్కరించుకుని డోన్ పట్టణంలోని కొండపై ఉన్న తిరుమల వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చనలు, అలంకరణలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు గిరి ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

సమ్మెను విజయవంతం చేద్దాం

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రఘురామమూర్తి, సుంకయ్య కోరారు. స్థానిక పెన్షనర్ల భవనంలో మంగళవారం వారు మాట్లాడారు. కార్మికుల హక్కులను హరించేలా కేంద్రం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

ఊరించి ఉసూరుమన్న వరుణుడు



కోవెలకుంట్లలో కురుస్తున్న తేలికపాటి వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మంగళవారం సాయంత్రం వరుణుడు తేలికపాటి వర్షంతోనే సరిపెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి ఎండతీవ్రత, ఉక్కపోతగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతం కావడంతో భారీ వర్షం కురుస్తుందని రైతులు భావించారు. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో తేలికపాటి వర్షం మాత్రమే కురవడంతో నిరాశ చెందుతున్నారు. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 24,915 హెక్టార్లలో కంది, మొక్కజొన్న, జొన్న, మినుము, వరి, ఆముదం, పత్తి, పొద్దుతిరుగుడు, సోయాచిక్కుడు, పెసర, తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. ఈ నెల 1వ తేదీ నుంచి సీజన్ ప్రారంభం కావడంతో ఆయా మండలాల పరిధిలో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. విత్తనం మొలకెత్తి నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షం పడకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కజొన్న, పత్తి, కంది, తదితర పంటలు బెండగిల్లిపోతుండడంతో సాగునీటిని మళ్లించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

హాస్టల్ విద్యార్థులకు పప్పన్నంతో సరి..!



బీసీ హాస్టల్‌లో వడ్డించిన అన్నం, పప్పు



వసతిగృహంలో పప్పన్నం తింటున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: పాఠశాలలు పునః ప్రారంభమై పట్టుమని పది రోజులే పూర్తయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది. కాని ఆచరణలో మెనూకు తిలోదకాలు ఇచ్చి విద్యార్థులకు పప్పన్నంతోనే సరిపెడుతున్నారు. ప్రభుత్వ ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లో విద్యార్థులకు వారంలో ప్రతి ఆదివారం మధ్యాహ్నం, మంగళ, శుక్రవారాల్లో రాత్రి మెనూ ప్రకారం చికెన్, కలర్‌రైస్, పెరుగుచెట్నీ, గోంగూరతో కూడిన ఆహారం అందించాలి. కోవెలకుంట్ల పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో మంగళవారం రాత్రి విద్యార్థులకు మెనూ పాటించకుండా పప్పన్నంతో సరిపెట్టారు. హాస్టల్‌లో 50 మంది విద్యార్థులు ఉండగా ఒక్కొక్కరికి 100 గ్రాముల చొప్పున చికెన్‌తోపాటు కలర్‌రైస్‌తో భోజనం పెట్టాల్సి ఉంది. అయితే విద్యార్థులకు అన్నం, పప్పు, మజ్జిగ, అరటిపండుతోనే సరిపెట్టడంతో ఏం చేసేది లేక విద్యార్థులు ఆ భోజనంతోనే సర్దుకోవాల్సి వచ్చింది.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి

డోన్ టౌన్: ప్రైవేట్ పాఠశాలలు కచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని.. లేకుంటే చర్యలు తప్పవని డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డి, మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో మంగళవారం ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, కంప్యూటర్ అపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి స్కూల్ నోటీస్ బోర్డులో ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాలని, స్కూల్ అవరణలో పుస్తకాలు, యూనిఫాం ఇతర వస్తువులు విక్రయించరాదని తెలిపారు. ప్రతి రోజు 10 గంటలలోపు హాజరు వేయాలని, ప్రభుత్వ సెలవు రోజుల్లో స్కూల్ నడపరాదన్నారు. విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) ద్వారా ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీటు పొందిన విద్యార్థులకు అడ్మిషన్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, కండీషన్ ఉన్న బస్సులు, వ్యాన్లు, ఆటోలనే వినియోగించాలని, అనుభవం ఉన్న డ్రైవర్లనే నియమించుకోవాలని సూచించారు. మూడేళ్లుగా విద్యా హక్కు చట్టం ద్వారా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలను అందించాలని పేర్కొన్నారు. సమావేశానికి గైర్హాజరైన వారు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ



కానాల గ్రామంలో విచారిస్తున్న డీఎస్పీ ప్రమోద్

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామంలో మే 4వ తేదీ తొమ్మిది మందిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై మంగళవారం ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన యాకోబుపై జరిగిన దాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంజామల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లడుతూ.. మండలంలో ఎలాంటి గొడవలకు తావు ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలని సూచించారు. గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. మహిళలతో గౌరవంగా మెలగాలని, అసభ్యకరంగా ప్రవర్తిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కోవెలకుంట్ల సీఐ హనుమంత్ నాయక్, ఎస్ఐ రమణయ్య ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



బోయ రంగ



గొల్ల విజయ్



వర్షిణి



షేక్ సుహానా



ఆయేషా

డోన్ టౌన్: ఆర్‌జీయూకేటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) మంగళవారం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో డోన్ విద్యార్థులు వివిధ ఐఐఐటీల్లో సీట్లు సాధించారు. బోయ రంగ శ్రీకాకుళం, గొల్ల విజయ్ నూజివీడు, ఉన్నిగోర్ల వర్షిణి, గొల్ల జోత్స్న సుమన్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు.

ప్యాపిలి నుంచి ఇద్దరి ఎంపిక

ప్యాపిలి: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పట్టణంలోని చికెన్ సెంటర్ నిర్వాహకుడు కమల్ హసన్ కుమార్తె షేక్ సుహానా పదో తరగతిలో 584 మార్కులు సాధించి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. అలాగే పట్టణానికి చెందిన గుజరి వ్యాపారి ఖాదర్, ఖతీజా కుమార్తె ఆయేషా 569 మార్కులతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. విద్యార్థినులను ఎంఈఓ వెంకటేశ్ నాయక్, హెచ్‌ఎం సరళాదేవి తదితరులు అభినందించారు.

బేతంచెర్ల నుంచి ముగ్గురి ఎంపిక

బేతంచెర్ల: మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరిలో పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలో టిఫిన్ సెంటర్ నిర్వహించే గంగాధర్‌రెడ్డి, శైలజ దంపతుల కుమారుడు జితేంద్రరెడ్డి, కోటపేట కాలనీకి చెందిన రాంగోపాల్ కుమార్తె లోహిత, బైనపల్లె గ్రామానికి చెందిన అనిమిగాళ్ల మేఘన ఉన్నారు.

సంజామల నుంచి ముగ్గురు

సంజామల: మండలం నుంచి ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని ఎంఈఓ ఈశ్వరయ్య తెలిపారు. నొస్సం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గురువైష్ణవి 584 మార్కులు, సల్మా-584, ఫబియా సుల్తాన-571 మార్కులతో సీటు సాధించారు.

అవుకు నుంచి ఏడుగురి ఎంపిక



రాకేష్



జీవన్

అవుకు: మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారని ఎంఈఓ శ్రీధర్ రావు తెలిపారు. గుండ్లశింగవరం పాఠశాలకు చెందిన పూజిత, అవుకు జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన నాగవైష్ణవి, ఆదర్శ పాఠశాలకు చెందిన రాకేష్, జీవన్, గౌతం, సుప్రజోత్స్న, మదర్ మోడల్ పాఠశాలకు చెందిన సుగాలి శ్రీవాణి సీటు సాధించారు.



జితేంద్రారెడ్డి



లోహిత



గురువైష్ణవి



సల్మా



ఫబియా సుల్తాన

కార్మికుల సమ్మెకు సంఘీభావం



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: కూటమి ప్రభుత్వం ముందు మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను ఏకరువు పెడుతున్నా చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు ప్రవర్తిస్తోందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ విమర్శించారు. తొమ్మిది రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు మంగళవారం చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు మిట్టా రవికుమార్, పెయింటర్ వెంకటేష్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. కనీస వేతనాలను పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జనాభా ప్రాతిపదికన కార్మికుల సంఖ్యను పెంచాలని చైర్మన్ రాజేష్ డిమాండ్ చేశారు. ఐదేళ్ల నుంచి విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాల పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం శోచనీయమన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికుల రిటైర్మెంట్ వయసును కూడా 62 ఏళ్లకు పెంచడంతో పాటు పర్మినెంట్ కార్మికులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్, ఎన్‌క్యాష్‌మెంట్‌తో పాటు బకాయి ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

ఏపీఎంగా బాధ్యతలు

కొలిమిగుండ్ల: స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా నాగరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించిన తిరుపాల్‌రెడ్డి బదిలీల్లో భాగంగా గత ఏడాది నంద్యాలకు వెళ్లారు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉండేది. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గడివేముల నుంచి నాగరాజును కొలిమిగుండ్ల ఏపీఎంగా నియమించారు.

మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

బేతంచెర్ల: వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందిస్తామని డాక్టర్ ఇర్ఫాన్ అన్నారు. పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీలో జనరల్ సర్జన్ వైద్యుడిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పత్తికొండ సీహెచ్‌సీ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా తోటి వైద్యులు, వైద్య సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

రేపు రాతిదూలం పోటీలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటిపల్లె గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవర 16 రోజుల పండగా సందర్భంగా గురువారం న్యూ క్యాటగిరి విభాగం రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు, రైతు సంఘం కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8332889066, 9441801801 నంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

150 మందికి వైద్య పరీక్షలు

కోవెలకుంట్ల: పట్టణంలోని కన్యకాపరమేశ్వరీదేవి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరాం ఆస్పత్రికి చెందిన డాక్టర్లు బీపీ, షుగర్, ఈసీజీ, గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఒకరిని గుండె శస్త్ర చికిత్స నిమిత్తం నంద్యాలకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం, సంఘం నాయకులు నాగరాజు, కాల్వ శివనాగయ్య, భూమా శేషఫణి, కృష్ణమూర్తి, సన్నిధి చంద్రశేఖర్, వెంకటసుబ్బయ్య, సత్య నరసింహులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

సంజామల: రైతుల భూ సమస్యలకు వీఆర్వోలు సత్వర పరిష్కారం చూపాలని తహసీల్దార్ అనీల్ కుమార్ అన్నారు. మంగళవారం సంజామల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రేషన్ డీలర్లలను సమన్వయం చేసుకుని ప్రజలకు సక్రమంగా రేషన్ అందే విధంగా చూడాలన్నారు.

ముసలాయిచెర్వు రేషన్ డీలర్ మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం మజార గ్రామమైన ముసలాయిచెర్వు గ్రామానికి చెందిన రేషన్ డీలర్ కుంచ సంజీవరెడ్డి (75) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహానికి ఆర్ఐ హేమంత్‌రెడ్డి, మండల డీలర్ల అసోసియేషన్ నాయకులు మురళయ్య, సుంకిరెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, ఫణి సాయి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

అవుకు స్టేషన్ సందర్శన

అవుకు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డోన్ డీఎస్పీ శ్రీనివాసులు మంగళవారం సందర్శించారు. పలు రికార్డులు, కేసుల వివరాలను స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ ఏడాది మే16వ తేదీ అవుకులో భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరుకళ్యాణోత్సవాల్లో భాగంగా రథోత్సవ కార్యక్రమంలో జరిగిన ఘటనపై పలువురు సాక్షులను డీఎస్పీ విచారించినట్లు సమాచారం.

80 శాతం సబ్సిడీతో డ్రోన్ స్ప్రేయర్లు



మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం

ప్యాపిలి: రైతులకు 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్ స్ప్రేయర్లు ఇస్తున్నట్లు నాబార్డు ఏజీఎం కేఆర్‌డీ కార్తీక్ తెలిపారు. మంగళవారం ప్యాపిలిలోని ఫుడ్ ప్రాసెసింగ్ ఆర్గనైజేషన్ (ఉత్పత్తిదారుల సంఘం) కార్యాలయాన్ని ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు ప్రణాళికతో పని చేసి ఆదాయం పెంచుకునే విధంగా పని చేయాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా 80 శాతం సబ్సిడీతో కిసాన్ డ్రోన్ స్ప్రేయర్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకుంటే డ్రోన్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కూడా ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ఆర్గనైజేషన్‌కు నాబార్డు ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



యనకండ్ల గ్రామంలో మాట్లాడుతున్న సీఐ గౌతమి

బనగానపల్లె రూరల్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నంద్యాల మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. మంగళవారం మండలంలోని యనకండ్ల గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులకు పోక్సో కేసు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వ్యాట్సాప్ ద్వారా వచ్చే ఏపీకే ఫైల్స్ ఎట్టి పరిస్థితుల్లో డౌన్‌లోడ్ చేయవద్దని సూచించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీ తదితర వివరాలను ఎవరితో పంచుకోవద్దని తెలిపారు.

పంటమార్పిడి లాభదాయకం



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి

కోవెలకుంట్ల: ఏటా ఒకే రకమైన పంట సాగు చేయకుండా పంటమార్పిడి విధానం అవలంబించి ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం రేవనూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలు, ఆయా పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు రెండేళ్ల నుంచి శనగ పంట సాగు చేసి నష్టపోతున్నారన్నారు. శనగ పంట వేసే ముందు జూన్, జులై నెలల్లో తక్కువ పంటకాలం కలిగిన మినుము, పెసర, కొర్ర, తదితర పంటలు సాగు చేయడం అన్ని విధాలా లాభదాయకమన్నారు. అలాగే భూమిలో సేంద్రీయ కర్బనం రోజు రోజుకు తగ్గిపోతోందన్నారు. సేంద్రీయ కర్బనాన్ని పెంచేందుకు భూమిలో పచ్చిరొట్ట ఎరువులు వేసుకుని భూమిని కలియ దున్నుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రాయితీపై కంది, మినుము, జొన్న విత్తనాలను సరఫరా చేస్తోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



సుంకేసులలో పొలం పిలుస్తోంది

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలో వ్యవసాయ అధికారిణి కరిమున్నీసా మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సాగు పద్ధతులు, పురుగు తెగుళ్ల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పంట విత్తిన 48 గంటల్లోపు అట్రాజిన్ కలుపు మందు ఎకరానికి తేలిక నేలలో 800 గ్రాములు, బరువు నేలలో 1200 గ్రాములు రపకారం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే కలుపు మొక్కలను అదుపు చేయవచ్చని తెలిపారు. పంట లేత దశలో ఉన్నప్పుడు నీరు అధికంగా ఉంచడం పంటకు హానికరం అన్నారు. మండల పశువైద్యాధికారిణి భారతీదేవి, వీహెచ్‌ఏ పఠాన్ నాయక్, వీఏఏ కళ్యాణి పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను బలహీనపర్చడం తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టి ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపర్చే కుట్రలు చేస్తోందని.. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డోన్ బ్రాంచ్ అధ్యక్షకార్యదర్శులు రహంతుల్లా, దేవన్న అన్నారు. మంగళవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయం వద్ద ఉద్యోగులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసీలో ప్రభుత్వ వాటాను ఉపసంహరించే కార్యక్రమాన్ని మరోమారు చేపట్టనుందని.. దీన్ని ప్రతిఘటించాలని కోరారు. బీమా ప్రీమియంపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని, 3,4 తరగతుల సిబ్బంది నియామకాలు చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఉద్యోగ సంఘం నాయకులు శేషయ్యశర్మ, రాఘవయ్య, కిరణ్, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీ అవినీతిపై విచారణ చేపట్టాలి

డోన్ టౌన్: పొదుపు సంఘాల్లో అక్రమాలకు పాల్పడుతూ, ప్రశ్నించే గ్రూపులను డీఫాల్ట్ చేస్తానని బెదిరింపులకు దిగుతున్న ఆర్పీ రమాదేవి అక్రమాలపై విచారణ చేపట్టి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పొదుపు మహిళలతో ధర్నా చేశారు.



ఎంపీపీ పాఠశాల ముందు బురదమయంగా మారిన రోడ్డు


చినుకుపడితే చిత్తడే

బనగానపల్లె రూరల్: చినుకు పడితే చాలు మండలంలోని కైప ఎంపీపీ పాఠశాల ఎదుటనున్న రోడ్డు బురదమయంగా మారుతోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు సుమారు 80 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. గ్రామంలో కొద్దిపాటి వర్షం కురిసినా పాఠశాల ముందే వర్షపు నీరు నిల్వ ఉండి అపరిశుభ్రంగా మారుతోంది. అధికారులు స్పందించి పాఠశాల ముందు మురుగునీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

బేతంచెర్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలో పగిలిపోయిన పైప్‌లైన్‌కు మంగళవారం మరమ్మతు పనులు చేశారు. పైప్‌లైన్ నుంచి తాగునీరు వృథాగా పోతుండడంపై సాక్షిలో ఈ నెల 22వ తేదీ 'పారుతున్న నిర్లక్ష్యం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై నగర పంచాయతీ అధికారులు స్పందించారు. పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేపట్టి సమస్యను పరిష్కరించారు.



పగిలిపోయిన పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేస్తున్న కార్మికుడు